# వాస్తవం

డెయిలీ.కామ్

ఉన్నది ఉన్నట్లుగా

డిజిటల్ పత్రిక

సోమవారం 3.08.2026

ఎడిటర్: ఎం.కృష్ణారెడ్డి(కె.ఆర్)


## ఆషాఢ బోనాలకు ఘనమైన చారిత్రక నేపథ్యం : సీపీ సజ్జనార్



**హైదరాబాద్ :** సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మ వారిని హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీపీ సజ్జనార్ దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. అమ్మవారికి సజ్జనార్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఆషాఢ మాస బోనాల ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్నానని తెలిపారు. ప్రజలంతా సుఖ సంతోషాలు, ఆ యురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఆషాఢ బోనాలకు ఎంతో ఘనమైన చారిత్రక నేపథ్యం ఉందని చెప్పుకొచ్చారు. ప్రస్తుతం నగరవ్యాప్తంగా ఉత్సవాలు అత్యంత ప్రశాంత వాతావరణంలో సాగుతున్నాయని వివరించారు.

# లష్కర్‌లో ఆధ్యాత్మిక శోభ

## వైభవంగా లష్కర్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాలు





- తొలి బోనం సమర్పించిన మంత్రి పొన్నం
- అమ్మవారిని దర్శించుకున్న సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి కొండా సురేఖ,బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- పోటెత్తిన భక్తులు.. మహంకాళికి మొక్కులు
- పోలీసుల భారీ బందోబస్తు

డప్పు చప్పుళ్లు.. పోతరాజుల విన్యాసాలు.. శివసత్తుల పూనకాలు.. సాంస్కృతిక కళారూపాలతో లష్కర్‌లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకున్నది. సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవం ఆదివారం అత్యంత వైభవంగా సాగింది. లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు..అమ్మవారికి బోనం సమర్పించి.. మొక్కులు చెల్లించుకున్నారు. లష్కర్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాలు ఆదివారం వైభవంగా జరిగాయి. బోనాల ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ఉదయం 3.30 గంటలకు మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు తొలి బోనం సమర్పించారు. అనంతరం 4.05 గంటల నుంచి భక్తులకు అమ్మవారి దర్శనం, బోనాలు సమర్పించేం దుకు అనుమతి ఇచ్చారు. మధ్యాహ్నం 12.45 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అమ్మవారికి బోనం సమర్పించి, దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెం ట్ కేటీఆర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, మల్లారెడ్డి, జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మర్రి రాజశేఖర్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్, ఇతర ప్రముఖులు, ప్రజాప్రతినిధులు అమ్మ వారిని దర్శిం చుకొని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి చల్లని దీవెనలతో రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిసి.. రైతులు సుభిక్షంగా ఉండాలని, ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని మాజీ మంత్రులు కేటీఆర్, తలసాని శ్రీని వాస్ యాదవ్ ఆకాంక్షించారు. కాగా, క్యూలైన్‌లలో వచ్చిన భక్తులకు సేవా సంస్థల వలంటీర్లు సేవలు అందించారు.ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

4లో..



### బోనాలను రాష్ట్ర పండుగగా గుర్తించింది కేసీఆరే

పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో బోనాల పండుగకు ప్రత్యేక స్థానం కల్పించి రాష్ట్ర పండుగగా గుర్తిం చిన ఘనత కేసీఆర్‌దేనని బీఆర్ఎస్ వ ర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. ఆదివారం సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళీ అమ్మవారిని దర్శిం చుకుని పూజలు చేశారు. రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలని అ మ్మవారిని వేడుకు న్నట్టు తెలిపారు. హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల ప్రజలు ఎంతో భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించుకుంటు న్నట్టు చెప్పారు. బోనాలతో వచ్చిన భక్తులతో కేటీఆర్ ముచ్చటించారు. భక్తులను ఆప్యాయంగా పలుకరిస్తూ ఆలయ పరిసరాల్లో సందడి చేశారు.

### రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాల్లో బోనాలు ప్రత్యేకం : పొన్నం ప్రభాకర్

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లో బోనాలు ప్రత్యేకమని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలపై అమ్మవారి కరుణా కటాక్షాలు ఉండాలని కోరుకున్నానని తెలిపారు. సమృద్ధిగా వర్షాలు పడాలని వేడుకున్నానని పేర్కొన్నారు. ఈరోజు 11:30గంటలకు సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాలకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరవుతారని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

### భక్తుల భద్రతే పోలీసుల లక్ష్యం

#### 2500 మంది పోలీసులతో భద్రత ఏర్పాట్లు

**ఆగస్ట్ 2 :** సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని ఆదివారం నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆషాఢబోనాల సందర్భంగా ఆలయానికి విచ్చేసిన ఆయన అమ్మవారికి పట్టువస్త్రాలు, బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పోలీసుల ఆధ్వర్యంలో చేపట్టిన భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ భాగ్యనగరంలో బోనాల పండుగకు చారిత్రక నేపథ్యముందని, నగర వ్యాప్తంగా ఉత్సవాలు ప్రశాంత వాతావర ణంలో జరుగుతున్నాయన్నారు. ఇప్పటికే గోల్కొండ, బల్కంపేట ఉత్సవాలు ముగిశాయని, ప్రస్తుతం ఉజ్జయిని మహంకాళి, లాల్‌దర్వాజ అమ్మవార్ల ఉత్సవాలు వైభవంగా జరిగాయ న్నారు. భక్తుల భద్రత, రక్షణే ధ్యేయంగా హైదరాబాద్ సిటీ పోలీసు శాఖ పటిష్టమైన ఏర్పాట్లు చేసిందన్నారు. ఉజ్జయిని మహంకాళి బోనాలకు దాదాపు 2500 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తుతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## ఆగస్టు 5న సీజేపీ కీలక సమావేశం

### భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయం



**ఢిల్లీ:** నీట్ ప్రశ్నపత్రం లీక్ అంశంపై ఆందోళనలతో దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన సీజేపీ సంస్థ ఆగస్టు 5న కీలక సమావేశాన్ని నిర్వ హించనుంది. మహారాష్ట్ర లోని ఛత్రపతి సంభాజీ నగర్‌లో వ్యవస్థాపకుడు అభిజిత్ నివాసంలో కోర్ కమిటీ సమా వేశమై భవిష్యత్ కార్యాచరణపై చర్చించనుంది. గత నెల రోజులుగా చేపట్టిన ఉద్య మంపై సమీక్షతో పాటు, ఇకపై అను సరించాల్సిన వ్యూహంపై నిర్ణయాలను కూడా ఈ సమావేశంలో తీసుకోను న్నారు. రాష్ట్రాల వారీగా విద్యార్థులు, వాలంటీర్లు, కార్యకర్తల నుంచి సేకరించిన అభిప్రాయాలు, సూచనలను కూడా కోర్ కమిటీ చర్చించనుంది. అనంతరం మీడియా సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యా చరణను అధికారికంగా ప్రకటించనున్నట్టు సమాచారం. తదుపరి దశలో చేపట్టే ఉద్య మాలు, కార్యక్రమాలపై కూడా స్పష్టత ఇచ్చే అవకాశం ఉంది .విద్యార్థి నిరసనల అంశంపై స్పందిస్తూ పిల్లలను క్షమిస్తున్నట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటిం చారు. అయితే క్షమాపణలతో సరిపెట్టకుండా విద్యార్థులపై నమోదైన కేసులను కూడా ఉపసంహరించుకోవాలని కేం ద్రాన్ని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ డిమాండ్ చేశారు. అలాగే జులై 20న జరిగిన పోలీసు చర్యపై ప్రభుత్వం అధికారికంగా క్షమాపణ చెప్పాలని ఆయన కోరారు. ఏదేమైనా ఆగస్టు 5 సమావేశం అనంతరం సీజేపీ ఉద్యమం ఏ దిశగా సాగనుందనే విషయంపై స్పష్టత వచ్చే అవకాశముంది.

## డ్రగ్స్ చీడ వదలాలి

### ‘నషా ముక్త్ యువ’ కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రధాని



ఢిల్లీ : యువతకు డ్రగ్స్ పీడ వదిలించే దిశగా ప్రధాని నరేంద్ర మోదీ నషా ముక్త యువ కార్యక్రమాన్ని ప్రారంభించారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండేలా యువతలో స్ఫూర్తి నింపేందుకు ఒక సమగ్ర ప్రచారకార్యక్రమంగా ‘నషా ముక్త యువ’ను ప్రారంభించామని ప్రధాని తెలిపారు. తాముంటున్న ప్రాంతాల్లో సానుకూల మార్పులకు కారకులుగా యువత నిలవాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని తీసుకొచ్చామని ప్రధాని చెప్పారు.‘వికసిత్ భారత్’ లక్ష్యాన్ని సాకారం చేసుకునేందుకు దేశ యువత ఆరోగ్యంగా ఉండటం అవసరమని ప్రధాని అన్నారు. ఈ కార్యక్రమం వ్యక్తులకే కాకుండా కుటుంబాలు, దేశ శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని రూపొందించామని అన్నారు. గతేడాది కాశీలో పైలట్ ప్రాజెక్టుగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన విషయాన్ని ప్రధాని పేర్కొన్నారు. ప్రస్తు తం ఇది దేశవ్యాప్తంగా అమలయ్యే స్థాయికి విస్తరిం చిందని చెప్పారు. ఈ క్యాంపెయిన్‌లో 125 ఆధ్యాత్మిక సంస్థలు కూడా చేరాయని చెప్పారు. డ్రగ్స్ రహిత సమాజం దిశగా కృషి చేస్తున్నాయని అన్నారు.‘కొన్ని పనులను పూర్తి చేసేందుకు ఒక వ్యక్తి సామర్థ్యం సరిపో దు. ఇలాంటి విషయాల్లో ఒంటరి పోరాటంతో అలసట, నిస్పృహ ఆవరిస్తాయి. కానీ అనేక మంది కలికట్టుగా రంగంలోకి దిగితే ఆ ఐక్యత నుంచి స్ఫూర్తి పొంది లక్ష్యా న్ని సాధించవచ్చు’ అని ప్రధా ని అన్నారు. ఇప్పటికే లక్షలాది మంది యువత ఇక డ్రగ్స్ జోలికి వెళ్లబోమని ప్రతినబూ నారని చెప్పారు.ఈ కార్యక్ర మంలో భాగంగా డ్రగ్స్‌తో కలిగే ముప్పుపై ప్రచార కార్యక్ర మా లను దేశవ్యాప్తంగా ప్రతి ఆది వారం నిర్వహించనున్నారు.

# రాజకీయాల కంటే ప్రజల ప్రాణాలు గొప్పవి

**జిల్లా ఆసుపత్రిని బలోపేతం చేయాలి : మాజీ ఎమ్మెల్యే గండ్ర**

**జిల్లా ఆసుపత్రి సమస్యలపై ఆకస్మిక తనిఖీ చేసిన మాజీ ఎమ్మెల్యే**

**తాగునీరు, పరిశుభ్రత,వైద్య సేవల లోపాలపై ఆగ్రహం**

**ఇది జిల్లా ఆసుపత్రా రిఫరల్ సెంటరా?**

**ఎంఆర్ఐ సేవలు ప్రారంభించి నెల గడిచినా అందుబాటులోకి రాలేదని విమర్శ**

**రోగులకు మెరుగైన వైద్య సేవలు కల్పించాలని ప్రభుత్వానికి డిమాండ్**

**వాస్తవం : భూపాలపల్లి**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి ఆదివారం ఆకస్మికంగా పరిశీలించారు. ఆసుపత్రిలో తాగునీటి కొరత, అపరిశుభ్రత, వైద్య సేవల లోపాలు, కనీస సౌకర్యాల కొరతపై ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను తెలుసుకుని పరిశీలించారు. ఆసుపత్రిలో ఐదు రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయిందని, రోగులు బయట నుంచి నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉండటంతో పాటు కొన్ని టాయిలెట్లకు తాళాలు వేయడం, ఆక్సిజన్ ప్లాంట్ సమస్యలు, ఆసుపత్రి ఆవరణలో నిరుపయోగంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇటీవల ప్రారంభించిన ఎంఆర్ఐ స్కాన్ సేవలు ఇప్పటికీ అందుబాటులోకి రాకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. చిన్న సమస్య వచ్చినా రోగులను ఇతర ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారని, "ఇది జిల్లా జనరల్ ఆసుపత్రా.. లేక రిఫరల్ సెంటరా"అని ప్రశ్నించారు. జిల్లా ఆసుపత్రికి తాగునీరు, పరిశుభ్రత, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది,మందులు,అవసరమైన వైద్య పరికరాలను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా ఆసుపత్రిని స్వయంగా సందర్శించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. రాజకీయాల కంటే ప్రజల ప్రాణాలు ముఖ్యమని, జిల్లా ఆసుపత్రిని బలోపేతం చేసి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని విజ్ఞప్తి చేశారు.

## హనుమకొండలోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో

# 'నషా ముక్త యువ ఫర్ వికసిత్ భారత్'

**వాస్తవం : హనుమకొండ, ఆగస్టు 02**





భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఎంవై భారత్ వరంగల్ సంస్థ హనుమకొండలోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో "నషా ముక్త యువ ఫర్ వికసిత్ భారత్" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, యువతకు మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించడం అత్యంత అవసరమని తెలిపారు. విద్యార్థులు,యువత మత్తు పదార్థాలు, డ్రగ్స్ ఇతర హానికర పదార్థాల వినియోగానికి దూరంగా ఉండి, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఎంవై భారత్ వరంగల్ జిల్లా యువజన అధికారి భూక్య సంజీవ్ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యాలను వివరించారు. అలాగే ఎంవై భారత్ శాఖ దేశ యువత కోసం నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలు, యువజనాభివృద్ధి చర్యలు ఎంవై భారత్ పోర్టల్ ద్వారా లభించే అవకాశాల గురించి సమగ్రంగా తెలియజేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో పాల్గొని యువతను ఉద్దేశించి ప్రసంగించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండి, శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ, ఆరోగ్యవంతమైన, బాధ్యతాయుతమైన జీవితాన్ని గడపాలని ఆయన యువతకు సందేశం అందించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో యువత పాల్గొని మాదకద్రవ్యాల రహిత భారత నిర్మాణానికి సంకల్పం వ్యక్తం చేశారు.

# కబ్జాకు గురవుతున్న మా భూమిని కాపాడండి

**డిఐ చేసిన సర్వే చెల్లదంటూ**

**భయభ్రాంతులకు గురి చేస్తున్నారు**

**పోలీసులు కడీలు నాటమన్నారంటూ దౌర్జన్యం**

**వాస్తవం: మాడ్గుల :**



రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం ఇర్విన్ గ్రామానికి చెందిన పాలకూర్ల భారతమ్మ తమ కుటుంబానికి చెందిన సర్వే నెంబర్ 314 వ్యవసాయ భూమిని అక్రమంగా కబ్జా చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.రెవెన్యూ.రికార్డులు,భూహక్కులకు సంబంధించిన నిబంధనలను పట్టించుకోకుండా తమ భూమిపై హక్కులు చెలాయించే ప్రయత్నం చేస్తున్నారని ఆమె ఆరోపించారు.భారతమ్మ తెలిపిన వివరాల ప్రకారం,మా పక్క భూమి అయినా సర్వే నెంబర్315 బుస్వామి సూదిని శేఖర్ రెడ్డి (ఎల్ఐసి) నా భూమి ఈ నెంబర్లో వెళ్తుంది అంటూ గత 5 6 సంవత్సరాల నుండి మమ్మలను బెదిరిస్తూ ఊరికి సంబంధించిన కొందరి పెద్దమనుషులని పురమాయించి పత్తి పంట ఉన్న చూడకుండా పంటను పాడుచేసి పోలీసులు కడీలు నాటమని చెప్పారంటూ మామ్మలని భయభ్రాంతులకు గురి చేస్తున్నాడు భూమికి సంబంధించిన వివాదం పూర్తిగా రెవెన్యూ శాఖ పరిధిలో ఉండగా, సంబంధిత చట్టాలు,విధివిధానాలను అనుసరించకుండా వ్యవహరిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారులు సమగ్ర పరిశీలన నిర్వహించి వాస్తవాలను నిర్ధారించాల్సి ఉండగా, అలాంటి చర్యలు కనిపించడం లేదని ఆమె వాపోయారు. అంతేకాకుండా, రెవెన్యూ పరిధిలో పరిష్కరించాల్సిన అంశంలో పోలీసులను కూడా జోక్యం చేసుకునేలా చేస్తున్నారని ఆమె ఆరోపించారు.భూ హక్కులపై తుది నిర్ణయం తీసుకునే అధికారం రెవెన్యూ శాఖకే ఉన్నప్పటికీ, తమపై ఒత్తిడి తీసుకురావడానికి పోలీసు వ్యవస్థను ఉపయోగిస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.దీనివల్ల తమ కుటుంబం తీవ్ర మానసిక వేదనకు గురవుతోందని తెలిపారు.తమ వద్ద భూమికి సంబంధించిన పాత పట్టాదారు పాస్‌బుక్లు, రెవెన్యూ రికార్డులు, మండల లైసెన్స్ టిఫన్ సర్వే పత్రాలు ఏడి పంచనామా డిఐ సర్వేర్ పత్రాలు అన్ని గత ఐదు సంవత్సరాల నుండి సర్వేలు చేపించామని అవేవీ చెల్లవంటూ జలుమ్ చేస్తున్నాడు అంటూ ఇతర ఆధార పత్రాలు ఉన్నాయని పేర్కొన్న భారతమ్మ, వాటిని పరిశీలించకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తే తమకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.ఈవ్యవహారంపై జిల్లా కలెక్టర్, రెవెన్యూ ఉన్నతాధికారులు వెంటనే జోక్యం చేసుకుని భూ రికార్డులను పరిశీలించి,అక్రమ కబ్జా యత్నాలను అడ్డుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.అలాగే చట్ట ప్రకారం విచారణ నిర్వహించి బాధ్యులపై తగిన చర్యలు తీసుకుని తమ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.గమనిక: ఈ కథనంలో పేర్కొన్న అంశాలు బాధితురాలు పాలకూర్ల భారతమ్మ చేసిన ఆరోపణల ఆధారంగా ప్రచురించబడుతున్నాయి. సంబంధిత రెవెన్యూ అధికారులు, పోలీసులు లేదా ఇతర ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తుల స్పందన అందిన వెంటనే ప్రచురించబడుతుంది.

# చెన్నూర్ మండలంలోని ముత్తేరావ్ పల్లి గ్రామంలో విషాదం

**వాస్తవం: చెన్నూర్ ఆర్సి**



ఇటీవలే జాడి ప్రవీణ్ అనే గ్రామ పంచాయతీ మల్టీ పర్పస్ వర్కర్‌తో పంచాయతీ కార్యదర్శి, గ్రామ సర్పంచ్ నిషేధిత గడ్డి మందును గ్రామంలో పిచికారి రెండు మూడు రోజులు చేయించినట్లుగా ఆరోపిస్తున్న కుటుంబ సభ్యులు..మంచిర్యాలలోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో వైద్యం చేయిస్తుండగా గడ్డిమందు పిచికారి చేసిన కారణంగానే మృతుడి ఊపిరితిత్తులు, కిడ్నీలు పాడైనట్లు వైద్యులు ధ్రువీకరించినట్లు తెలిపిన కుటుంబ సభ్యులు..పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి..పోస్టుమార్టం నిమిత్తం ప్రవీణ్ మృతదేహన్ని చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు.శవ పరిక్షలు చేసిన అనంతరం . జాడి ప్రవీణ్ భార్య, ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. నా పిల్లలకు ఆధారం చూపెట్టండి నాకు న్యాయం చేయండి అని అడగగా ముత్తిరావుపల్లి.సర్పంచ్ ఉప సర్పంచ్. సెక్రటిరీ వీళ్లంతా కలిసి ఆమెకు అన్యాయం చేస్తాము ఆమె భర్త ఏ పని చేశారు అందులోనే ఈమెకు పనివచ్చే విధంగా మేము చూస్తాము అదేవిధంగా 11 రోజుల వరకు అయ్యే ఖర్చును మేం భరించుకుంటామని తెలియజేశారు.అని. చెన్నూరు ఎస్ఐ శ్యామ్ పటేల్, ఐ ఎఫ్ టి యు నాయకులు మాసాని రమేష్, కావేరి సంతోష్, కావేరి రవి, వాళ్ల పెద్ద మనుషుల ముంగట చెప్పినారు చెప్పిన. జాడి ప్రవీణ్ భార్య, నాకు న్యాయం జరగకపోతే నేను మళ్లీ కేసు పెడతాను. అని .అన్నారు. అనంతరం చెన్నూర్ గవర్నమెంట్ హాస్పటల్ నుంచి డెడ్ బాడీ తీసుకొని ముత్తరావుపల్లి లో అంతక్రియలు జరిపించారు.

## గ్రామస్థాయి నుండి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయండి



**వాస్తవం : కొమురవెల్లి**

కొమురవెల్లి మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ సన్నాహక సమావేశంలో సిద్ధిపేట జిల్లా డీసీసీ అధ్యక్షురాలు తూముకుంట ఆంక్ష రెడ్డి పాల్గొని పార్టీ బలోపేతంపై నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో కొమురవెల్లి, చేర్యాల, చేర్యాల టౌన్, దూల్మిట్ట, మద్దూరు మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, జిల్లా ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలంటే ప్రతి నాయకుడు, కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు ఆగస్టు 5వ తేదీలోపు మండల కమిటీలను, ఆగస్టు 15వ తేదీలోపు గ్రామ కమిటీలను పూర్తి చేయాలని సూచించారు. పార్టీ కోసం చిత్తశుద్ధితో పనిచేసే నాయకులు, కార్యకర్తలకే సంస్థాగతంగా ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించే వారికి పదోన్నతులు కల్పిస్తామని, పనితీరు ఆశించిన స్థాయిలో లేకపోతే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పార్టీ పదవులను హోదాలుగా కాకుండా బాధ్యతగా భావించి పనిచేయాలని సూచించారు. అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రతి ఇంటికి చేరవేసి, ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ నాయకులకు సూచించారు.

**హైదరాబాద్‌లో 6న జరిగే**

## ప్రజాయుద్ధనౌక గద్దర్ మూడో వర్ధంతి సభను జయప్రదం చేయండి

**చుంచు రాజేందర్ డిబిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు**



**వాస్తవం : హనుమకొండ**

ప్రజా యుద్ధనౌక గద్దర్ మూడో వర్ధంతి ఈ నెల ఆరో తేదీన సాయంత్రం నాలుగు గంటలకు హైదరాబాదులోని రవీంద్రభారతిలో గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వర్ధంతి సభ జరుపనున్నారు దీనిని విజయవంతం చేయాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చుంచు రాజేందర్, రైల్వే జేఏసీ చైర్మన్ కొండ్ర నర్సింగరావులు పిలుపునిచ్చారు. డిబిఎఫ్ ఆధ్వర్యంలో హన్మకొండ నందు గద్దర్ మూడో వర్ధంతి సభ సంబంధించిన పోస్టర్ ను విడుదల చేశారు. ఈ సందర్భంగా చుంచు రాజేందర్ మాట్లాడుతూ గద్దర్ సంస్మరణ సభకు ముఖ్యఅతిథిగా ప్రకాష్ అంబేద్కర్ హాజరవుతున్నారని తెలిపారు. ఈ సభకు ప్రజలు,ప్రజాస్వామిక వాధులు,విద్యార్థులు,మేధావులు, అంబేద్కర్ వాధులు, గద్దర్ అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేయూ జాక్ చైర్మన్ డాక్టర్ మంద వీరస్వామి, డిబిఎఫ్ జిల్లా కార్యదర్శి మాదాసి సుదర్శన్, సపాయి కర్మచారి అందోళన జిల్లా బాధ్యులు దండు కుమార్,డిబిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు చుంచు నరేష్, జిల్లా నాయకులు కొమ్ముల కరుణాకర్, ప్రజా సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ మాదాసి సురేష్, మాజీ యంపిపి మాట్ల రమేష్, రమాకాంత్,సమ్మయ్య,కిరణ్,రాజు,కుమార్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు త్వరలో యూనిఫాంల పంపిణీ



**వాస్తవం: మద్దూరు**

మద్దూరు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఏకరూప దుస్తుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మద్దూరు మండలం లోని పలు గ్రామాల్లో బట్టల పంపిణీ చేపట్టారు. విద్యార్థులకు దుస్తులు కుట్టించేందుకు ఆయా గ్రామాల్లో మహిళా సంఘాలకు చెందిన టైలరింగ్ చేసే సభ్యులను గుర్తించి వారికి బట్టలను అందజేశారు.మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో చదువుతున్న విద్యార్థినుల కోసం 470 యూనిఫాంలను కుట్టించి అందజేశారు.అలాగే మండలంలోని ఇతర ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యా ర్థులకు కూడా యూనిఫాంలు కుట్టించేందుకు సంబంధిత గ్రామాలకు బట్టలను పంపిణీ చేశారు.అతి త్వరలో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన ఏకరూప దుస్తులను కుట్టించి పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీలు మహేందర్, కనక, చంద్రం, సుమలత, వివోలు, మహిళా సంఘాల సభ్యులు, విద్యాశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**రామగుండం తబితా ఆశ్రమంలో**

## 'ఫ్రెండ్‌షిప్ డే' వేడుకలు



**వాస్తవం : గోదావరిఖని**

రామగుండం నియోజకవర్గంలో "ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ" ఆధ్వర్యంలో మిత్రుల దినోత్సవ వేడుకలు అత్యంత ఆనందోత్సా హాల మధ్య నిర్వహించబడ్డాయి ఇందులో భాగంగా స్థానిక తబితా ఆశ్రమంలో ఉన్న చిన్నారులతో కలిసి ఘనంగా ఫ్రెండ్షిప్ డే వేడుకలు జరిపారు. ఈ కార్యక్రమానికి ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్ ముఖ్య అతిథిగా విచ్చేసి ఆశ్రమ పిల్లల మధ్య కేక్ కట్ చేసి వారితో కలిసి పంచుకున్నారు పిల్లలందరికీ కేక్ తినిపించి ఆప్యాయంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మద్దెల దినేష్ మాట్లాడుతూ "పిల్లలందరూ కష్టపడి బాగా చదువు కొని జీవితంలో అత్యున్నత స్థాయికి ఎదగాలని" ఆకాంక్షించారు అమ్మానాన్న లేని లోటు తెలియకుండా ఆశ్రమ నిర్వాహకులు వీరేంద్ర నాయక్ ఆ పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ సొంత పిల్లల్లా సాకుతున్న తీరు ఎంతో అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలు ప్రముఖ సంఘాల నాయకులు భాగస్వాములయ్యారు.సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు తొడుపునూరి రమేష్ కుమార్, గౌస్ అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లెనిన్ పాల్గొన్నారు.

జన్మదినోత్సవాలు,
పదవీ విరమణ
శుభాకాంక్షల
ప్రకటనల కోసం సంప్రదించండి
8074124190
వాస్తవం

# కాలనీ అభివృద్ధే ధ్యేయం

**శ్రీ వినాయక కాలనీ నూతన కమిటీ ఎన్నిక**

**అధ్యక్షునిగా సీనియర్ జర్నలిస్టు క్యాతం సతీష్ కుమార్**



**వాస్తవం : భూపాలపల్లి**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని 9వ వార్డు మంజునగర్ పరిధిలోని శ్రీ వినాయక కాలనీ (వెంగళరావు నగర్ వెంచర్) నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం ప్రశాంత వాతావరణంలో జరిగాయి. ఎన్నికల అధికారులుగా ప్రభుత్వ ఉపాధ్యాయుడు సల్ల సంపత్, తిరుపతి రెడ్డి వ్యవహరించారు. కాలనీ వాసుల సమక్షంలో నిర్వహించిన ఎన్నికల్లో సీనియర్ జర్నలిస్ట్ క్యాతం సతీష్ కుమార్ అధ్యక్షుడిగా,పైతారి మహేష్ ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షులుగా సామల లక్ష్మారెడ్డి, తోటపల్లి వైకుంఠం, ముఖ్య సలహాదారుగా సల్ల సంపత్ ఎంపికయ్యారు. ఉపాధ్యక్షుడిగా రాగుల కనకయ్య, కార్యదర్శిగా చల్ల రవీందర్ రెడ్డి, కోశాధికారిగా పసునూటి సుమన్, సహాయ కోశాధికారిగా పంచనేని రామారావు, సోషల్ మీడియా ఇన్‌చార్జిగా కర్రే రాజు ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా నిమ్మతి జితేందర్, గండు శ్రీధర్, అంగోత్ తిరుపతి, అమృత క్రాంతి కుమార్ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు క్యాతం సతీష్ కుమార్ మాట్లాడుతూ, తమపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన కాలనీ వాసులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అందరి సహకారంతో కాలనీ అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తామని చెప్పారు. పాత కమిటీ సభ్యుల అనుభవాలు, కాలనీ పెద్దల సూచనలు, నివాసితుల అభిప్రాయాలను గౌరవిస్తూ పారదర్శకంగా వ్యవహరిస్తామని పేర్కొన్నారు. కాలనీలో మౌలిక సదుపాయాల మెరుగుదల, పరిశుభ్రత, తాగునీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాలు, భద్రత వంటి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తామని తెలిపారు. ప్రతి కుటుంబానికి అందుబాటులో ఉండే కమిటీగా పనిచేస్తూ, శ్రీ వినాయక కాలనీని ఆదర్శ కాలనీగా తీర్చిదిద్దేందుకు అహర్నిశలు శ్రమిస్తామని నూతన కమిటీ సభ్యులు వెల్లడించారు.

# ప్రపంచ ఆదివాసి దినోత్సవ వారోత్సవాలను జయప్రదం చేద్దాం

**ఎర్మ పున్నం జిల్లా కార్యదర్శి**

**తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం(టి ఏ జి)**



**వాస్తవం : చెన్నూర్ ఆర్సి**

తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆగస్టు 9 ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుంది ఈ సందర్భంగా వేమనపల్లి మండల కేంద్రంలో సన్నాహక సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఎర్మ పున్నం మాట్లాడుతూ అనేక సంవత్సరాల కాలంగా ఈ ప్రాంతంలో ఆదివాసిలు ఎదుర్కొంటున్న ఆ అనేక సమస్యలపై నిరంతరం పోరాటాలు చేసాము ఆదివాసి రైతులపై అటవీశాఖ అధికారుల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేసి హక్కు పత్రాలు ఇప్పించడం జరిగింది. ఆదివాసీలు వేసుకున్న పంటలను ధ్వంసం చేసిన అటవీ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆదివాసులకు అండగా ఉంటూ పోరాటాలు చేయడం మూలంగా అటవీ అధికారులను తిప్పి కొట్టగలిగాము. మరియు ఈ ప్రాంతంలో ఆదివాసీల పైన పెత్తందారుల దౌర్జన్యాలు అడ్డు అదుపు లేకుండా ఉన్నాయి వారి దౌర్జన్యాల మూలంగా నిరుపేద ఆదివాసి చనిపోవడం జరిగింది ఆ కుటుంబానికి అండగా అనేక కార్యక్రమాలు నిర్వహించి ఆ యొక్క కుటుంబానికి తగిన న్యాయం జరిగే వరకు పోరాటాలు చేయడం జరిగింది. భవిష్యత్తులో ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని పురస్కరించుకొని మన హక్కులను కాపాడుకోవడం కోసం ఇలాంటి దౌర్జన్యాలపై మరెన్నో పోరాటాలు చేయడానికి కార్యచరణ రూపొందించుకోవడం జరుగుతుంది. కావున వేమనపల్లి మండల కేంద్రంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవ వారోత్సవాల సందర్భంగా ఆగస్టు 6వ తేదీన ఘనంగా మండల కేంద్రంలో నిర్వహించడం జరుగుతుంది. ఈ యొక్క సభకి అన్ని ఆదివాసి గ్రామాల నుండి ఆదివాసీలు, రైతులు, మేధావులు, విద్యార్థులు, యువకులు ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని మరియు ప్రపంచ ఆదివాసి దినోత్సవ స్ఫూర్తిని చాటేందుకు అన్ని గ్రామాలలో జెండా ఆవిష్కరణలు సభలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు బాల రాజన్న, జిల్లా నాయకురాలు మర్మల మల్లేశ్వరి, మండల నాయకులు కొండపల్లి వెంకన్న, మర్మల శంకర్, లగ్గామ గట్టయ్య, కొడితే లక్ష్మణ్, ఓల తిరుపతి, నాయిని పోషం, తలండి స్వరూప తదితరులు పాల్గొన్నారు

# భావితరాలకు స్ఫూర్తిదాయకం బాదిని చెన్నయ్య పోరాటం

**పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం తపించిన మహనీయుడు**

**సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు కే. రాజయ్య**

**డిజైర్ సొసైటీ అనాథాశ్రమంలో అన్నదాన కార్యక్రమం**



**వాస్తవం : పటాన్చెరు : ఆగస్ట్ 02**

బావి తరాలకు ఉమ్మడి నల్గొండ జిల్లా మాజీ చైర్మన్ భాదిని చెన్నయ్య పోరాటం స్ఫూర్తిదాయకమని సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు కే రాజయ్య అభిప్రాయపడ్డారు. ఆదివారం ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ దివంగత భాదిని చెన్నయ్య 5వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన అభిమానులు, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. బొల్లారం డివిజన్ పరిధిలోని 'డిజైర్ సొసైటీ' అనాథ ఆశ్రమంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని సిఐటియు (రాష్ట్ర కమిటీ సభ్యులు కే. రాజయ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కే. రాజయ్య మాట్లాడుతూ.. బాదిని చెన్నయ్య ఒక సామాన్య కుటుంబం నుండి వచ్చి, తన కృషి పట్టుదలతో అంచలంచెలుగా ఎదిగి ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్‌గా ప్రజలకు విశేష సేవలందించారని కొనియాడారు. సీపీఐ(ఎం) పార్టీలో వివిధ స్థాయిల్లో పనిచేస్తూ, పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం, వారి హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడిన గొప్ప నాయకుడని ఆయన స్మరించుకున్నారు. పేదరికం ఎంతలా వెంటాడిన దృఢ సంకల్పంతో ఉమ్మడి నల్లగొండ జిల్లా జడ్పీ చైర్మన్‌గా ఎదిగారన్నారు. వ్యవసాయ కూలీగా.. పోరాట యోధుడిగా.. రాజకీయ నేతగా.. ప్రజాప్రతినిధిగా.. పేదోడి కంచంలో మెతుకులా.. ఉన్నోడి అహంకారానికి ధిక్కార స్వరంలా.. ప్రజాసమస్యలపై పోరాడి నిలిచిన మార్గదర్శకుడు బాదిని చెన్నయ్య అని గుర్తు చేసుకున్నారు. నోముల గ్రామంలోని నాటి అసమానతలను ఎవ్వరికీ నొప్పి కలిగించకుండా తన రాజకీయ చతురతతో పరిష్కరించిన తీరు అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా భాదిని చెన్నయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బాదిని శ్రీను, సత్యం, రాజ్‌కుమార్, శ్రీనివాస్, కృష్ణ గౌడ్, ప్రదీప్ రెడ్డి, అనిల్ తో పాటు డిజైర్ సొసైటీ నిర్వాహకులు, సిబ్బంది, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ఏబీఆర్ ట్రస్ట్ నుంచి మూడు కీలక సంక్షేమ కార్యక్రమాలు

**అల్లం బాలకిషోర్ రెడ్డి జన్మదినం-అల్లం స్వప్న బాలకిషోర్ రెడ్డి**

**దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా**

**నిరుపేద మహిళలకు ఉచిత చీరల పంపిణీ.. సామూహిక అన్నదానం**

**ఆగస్టు 15 నుంచి ఇల్లు లేని అర్హులైన నిరుపేద కుటుంబాలకు**

**రూ. 5 లక్షల వరకు గృహ నిర్మాణ సహాయం**

**నిరుద్యోగ యువతీ యువకులకు రూ.5 లక్షల వరకు స్వయం ఉపాధి ప్రణాళికలకు**

**75 శాతం వరకు ఆర్థిక తోడ్పాటు**

**దసరా నుంచి ఆదరణ లేని 60 ఏళ్ళు పైబడిన వృద్ధులకు ప్రతి నెలా**

**నిత్యావసర సరుకుల పంపిణీ**



**వాస్తవం : గీసుకొండ : ఆగష్టు 02**

ప్రముఖ పారిశ్రామికవేత్త, జిల్లా కాంగ్రెస్ నాయకులు అల్లం బాలకిషోర్ రెడ్డి జన్మదినం, అల్లం స్వప్న బాలకిషోర్ రెడ్డి దంపతుల వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మిత్రులు, నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు ఆదివారం గీసుకొండ మండల కేంద్రంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కార్యక్రమానికి హాజరైన నిరుపేద మహిళలకు ఉచితంగా చీరలు పంపిణీ చేయడంతో పాటు సామూహిక అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి దంపతులకు జన్మదిన, వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గీసుకొండ గ్రామ సర్పంచ్ వీరగోని రాజ్‌కుమార్, జిల్లా కాంగ్రెస్ నాయకుడు అల్లం మర్రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గీసుకొండ గ్రామ సర్పంచ్ వీరగోని రాజ్‌కుమార్ మాట్లాడుతూ, అల్లం బాలకిషోర్ రెడ్డి--అల్లం స్వప్న బాలకిషోర్ రెడ్డి దంపతులు తనకు తెలియజేసిన సేవా సంకల్పాలను ప్రజలకు వెల్లడిస్తున్నట్లు తెలిపారు. సమాజంలోని అవసరమైన వర్గాలకు అండగా నిలవాలనే లక్ష్యంతో అల్లం బాలకిషోర్ రెడ్డి ఎన్నో ఏళ్లుగా నిరుపేద కుటుంబాలకు ఆర్థిక సహాయం, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వైద్య సహాయం, నిరుపేద విద్యార్థులకు ఉన్నత విద్య కోసం ఆర్థిక చేయూత, పేద కుటుంబాల వివాహాలకు సహకారం, ప్రతిభావంతులైన క్రీడాకారులకు ప్రోత్సాహం, దేవాలయాల అభివృద్ధికి విరాళాలు, గ్రామాల్లో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు సహకారం అందిస్తూ సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్నారని తెలిపారు. అల్లం బాలకిషోర్ రెడ్డి దంపతుల సూచన మేరకు ఏబీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపట్టనున్న మూడు ప్రధాన సంక్షేమ కార్యక్రమాలను కూడా ఆయన వెల్లడించారు. గ్రామ సర్పంచ్ ఎన్నికలకు ముందు అల్లం బాలకిషోర్ రెడ్డి ప్రకటించిన మేరకు, రానున్న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఇల్లు లేని అర్హులైన నిరుపేద కుటుంబాలకు గృహ నిర్మాణం కోసం రూ.5 లక్షల వరకు ఆర్థిక సహాయం అందించనున్నట్లు తెలిపారు. అలాగే, స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదగాలనుకునే నిరుద్యోగ యువతీ యువకులు రూ.5 లక్షల వరకు వ్యాపార ప్రణాళికతో ముందుకు వస్తే, లబ్ధిదారులు 25 శాతం పెట్టుబడి సమకూర్చగా, మిగిలిన 75 శాతం మొత్తాన్ని ఏబీఆర్ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సహాయంగా అందించనున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా, ఈ ఏడాది దసరా పండుగ నుంచి 60 సంవత్సరాలు దాటిన, కుటుంబ సభ్యుల ఆదరణ లేక జీవనం సాగిస్తున్న వృద్ధ మహిళలు, పురుషులకు ప్రతి నెల నిత్యావసర సరుకులను ఉచితంగా అందించే కార్యక్రమాన్ని ఏబీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. వేడుకలను సేవా కార్యక్రమాలతో అనుసంధానం చేస్తూ ఏబీఆర్ ట్రస్ట్ ప్రకటించిన సంక్షేమ కార్యక్రమాలు నిరుపేద కుటుంబాలు, నిరుద్యోగ యువతీ యువకులు, ఆదరణ లేని వృద్ధులకు ఉపయోగపడే దిశగా ఉండటంతో కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

**అన్నదానంతో పాటు**

# పేద మహిళలకు చీరల పంపిణీ



**వాస్తవం : వేములవాడ**

మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో 1939 వ రోజు గా నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక టీటీడీ ధర్మశాల రాజన్న భీమేశ్వర ఆలయాల వద్ద అన్నార్తులకు పేదలకు అన్నదాన కార్యక్రమంతో పా టు పండ్లు, ట్రస్ట్ సభ్యులు నాగుల చంద్రశేఖర్- భవాని దంపతులు అందించిన చీరలు పేద మహిళలకు నిర్వహించారు. అన్నదాతలుగా శ్రీరాముల గోపాల్ జ్ఞాపకా ర్థం మీది కుమారులు శ్రీరాముల రవి, శ్రీరాముల శ్రీధర్ కుటుంబ సభ్యులు, చిరంజీవి బొడిగె జస్విత్ పుట్టినరోజు సందర్భంగా వీరి అమ్మానాన్న బొడిగె శేఖర్ -లావణ్య దంపతులు, వీరి అన్నయ్య శ్రీమాన్ తేజ శాశ్వతదాతలు డాక్టర్ జువ్వాడి వెంకటేశ్వరరా వు- స్నేహలత దంపతులు, ప్రతాప స్వప్న- సంపత్ దంపతులు, నగుబోతు రవీందర్- జ్యోతి దంపతులు గణాచారి మఠం శైలజ -సాంబశివు దంపతులు, దేవరాజు ఉమ -బాలచందర్ రాజు దంపతులు, రామడుగు శ్రీలత కొడుకులు కోడళ్లు ప్రజ్ఞ- శరత్ చంద్ర దంపతులు,శిరీష- సాయిచంద్ర దంపతులు, శర్వాణి -రవిచంద్ర దంపతులు, హైదరాబాద్ వాస్తవ్యులు చిన్నారులు శ్రీహర్ష, సాయి కృష్ణల సహాయ సహకారాలతో అన్నదానం కార్యక్రమం నిర్వహించినట్లు ట్రస్ట్ ప్రతినిధులు వెల్లడించారు.పుట్టిన, పెళ్ళి రోజు, ఇతరత్ర కార్యక్రమాలకు పేదలకు అన్నార్తులకు ఒక్క పూట అన్నదానం చేయల నుకునే దాతలు ట్రస్టు సభ్యులను గాని, ట్రస్ట్ నంబరు 9246939388 కు సంప్రదిం చాలని ట్రస్ట్ నిర్వాహకులు డాక్టర్ మధు మహేష్ కోరారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పొలాస రాజేందర్, సగ్గు రాహుల్,పసుల శ్రీధర్,దూలం సంపత్,బొడిగె శేఖర్- లావణ్య దంపతులు, శ్రీమాన్ తేజ,బొడిగె జస్విత్‌లు,తదితరులు పాల్గొన్నారు.

**నేవూరి ధర్మేందర్ రెడ్డి జన్మదినం సందర్భంగా**

# బ్రెడ్, పండ్ల పంపిణి



**వాస్తవం : మోత్కూర్**

మలిదశ తెలంగాణ ఉద్యమ నేత ఉస్మానియా ముద్దు బిడ్డ బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నేవూరి. ధర్మేందర్ రెడ్డి జన్మదినం సందర్భంగా యాదాద్రి జిల్లా మోత్కూర్ మండల కేంద్రంలో దాసరి. తిరుమలేష్ ఆధ్వర్యంలో మోత్కూర్ ప్రభుత్వ ధవాఖానాలో రోగులకు మరియు వృద్ధులకు పండ్లు మరియు బ్రెడ్ పంపిణి కార్యక్రమం ఏర్పాటు చెయ్యగా ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్న మోత్కూర్ మున్సిపాలిటీ బిఆర్ఎస్ అధ్యక్షులు జంగ.శ్రీను రోగులకు పండ్లు బ్రెడ్ ప్యాకెట్లు పంపిణి చేశారు ఈ కార్యక్రమంలోబి.ఆర్.ఎస్ నాయకులు చేతరాశి వెంకన్న అన్నందాసు .విద్య సాగర్, జిట్ట. సాయికుమార్,దాసరి.నరేష్,గుగ్గిళ్ళ.కృష్ణ, కందుకూరి. యాదగిరి,అజయ్,ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

**జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం**

## వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గురిజాల శ్రీధర్



**వాస్తవం : రాజన్న సిరిసిల్ల (ప్రతినిధి)**

శ్రామిక కార్మిక వర్గాలు, వ్యవసాయ కూలీలు, ఉపాధి హామీ కూలీలతో ఈనెల 10 న నిర్వహించే జైలు భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర వ్యవసాయ కూలీల సంఘం రాజన్న సిరిసిల్ల కార్యదర్శి గురిజాల శ్రీధర్ పిలుపునిచ్చారు.తెలంగాణ వ్యవసాయ కార్మిక జిల్లా సంఘం ఆధ్వర్యంలో జిల్లాలోని దుంద్రపల్లి గ్రామములో ఆదివారం కరపత్రం విడుదల చేశారు.ఉపాధి హామీ కూలీలకు 200 రోజులు పని కల్పించాలి, రోజువారి వేతనం 600 రూపాయలు చెల్లించాలి.మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలి.వికసిత్ భారత్ గ్రామ్ జి చట్టాన్ని రద్దు చేయాలి.ఈ నెల 10,న కలెక్టర్ కార్యాలయం వద్దజైల్ భారో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.కేంద్రంలో యూపీఏ కాంగ్రెస్ ప్రభుత్వం 2005లో ఉన్నప్పుడు వామపక్షాల పోరాట ఫలితంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి గ్యారెంటీ చట్టం అమలు చేయబడ్డది. పోరాడి సాధించుకున్న వందరోజుల పనిని ఈరోజు కేంద్రంలో ఉన్న యూనియన్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా బిజెపి ప్రభుత్వం మహాత్మా గాంధీ పేరును తొలగించి దీని స్థానంలో"వికసిత్ భారత్ గ్రామ్ జీ మార్పు చేయడమే కాక, రాష్ట్రాల వాటా 10, శాతం నుండి,40 శాతం నిధులను భరించాలని రాష్ట్రాల మీద భారం రు ద్దాలని,కేంద్ర ప్రభుత్వం ఇదే అదునుగా భావించి మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ 100 రోజుల పనిని ఎత్తివేయాలని కుట్రలు చేస్తుంది. ఈ కుట్రలు తిప్పి కొట్టడానికి ఈనెల 10 న తలపెట్టిన జైలు భరో కార్యక్రమానికి పెద్ద ఎత్తున వ్యవసాయ కూలీలు, ఉపాధి హామీ ,కూలీలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గురిజాల శ్రీధర్ కోరారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం దుంద్రపల్లి గ్రామమహిళలుపాల్గొన్నారు.

జర్నలిస్ట్స్ సంక్షేమ సంఘం
Red 914/2015
జర్నలిస్ట్స్ సంక్షేమమే పరమావధిగా
జర్నలిస్ట్స్ హక్కుల కోసం....
వాళ్ల ప్రగతి కోసం... పత్రికా స్వేచ్ఛ కోసం...
సభ్యత్వ నమోదు కోసం సంప్రదించండి సెల్ నెం: 9618616110

# బోనమెత్తిన లష్కర్

- తొలి బోనం సమర్పించిన మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు
- బోనం సమర్పించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- అమ్మవారిని దర్శించుకున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఇతర ప్రజాప్రతినిధులు
- భక్తులకు సేవలందించిన వివిధ సంస్థల వలంటీర్లు
- అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసుల భారీ బందోబస్తు
- పోటెత్తిన భక్తులు.. మహంకాళికి మొక్కులు





**డప్పు చప్పుళ్లు.. పోతరాజుల విన్యాసాలు.. శివసత్తుల పూనకాలు.. సాంస్కృతిక కళారూపాలతో లష్కర్‌లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకున్నది. సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవం ఆదివారం అత్యంత వైభవంగా సాగింది. లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు..అమ్మవారికి బోనం సమర్పించి.. మొక్కులు చెల్లించుకున్నారు. లష్కర్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాలు ఆదివారం వైభవంగా జరిగాయి. బోనాల ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ఉదయం 3.30 గంటలకు మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు తొలి బోనం సమర్పించారు. అనంతరం 4.05 గంటల నుంచి భక్తులకు అమ్మవారి దర్శనం, బోనాలు సమర్పించేం దుకు అనుమతి ఇచ్చారు. మధ్యాహ్నం 12.45 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అమ్మవారికి బోనం సమర్పించి, దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, మల్లారెడ్డి, జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మర్రి రాజశేఖర్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్, ఇతర ప్రముఖులు, ప్రజాప్రతినిధులు అమ్మ వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి చల్లని దీవెనలతో రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిసి.. రైతులు సుభిక్షంగా ఉండాలని, ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని మాజీ మంత్రులు కేటీఆర్, తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆకాంక్షించారు. కాగా, క్యూలైన్‌లలో వచ్చిన భక్తులకు సేవా సంస్థల వలంటీర్లు సేవలు అందించారు.ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.**

**బేగంపేట్, ఆగస్టు 2:**

లష్కర్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాలు ఆదివారం వైభవంగా జరిగాయి. బోనాల ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ఉదయం 3.30 గంటలకు మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు తొలి బోనం సమర్పించారు. అనంతరం 4.05 గంటల నుంచి భక్తులకు అమ్మవారి దర్శనం, బోనాలు సమర్పించేందుకు అనుమతి ఇచ్చారు. మధ్యాహ్నం 12.45 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అమ్మవారికి బోనం సమర్పించి, దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. బోనాల సందర్భంగా దేవదాయ శాఖ భక్తులకు కావలసిన ఏర్పాట్లు చేసింది. పోలీసులు భక్తుల భద్రత కోసం భారీ బందోబస్తు చేశారు. ప్రత్యేక క్యూలైన్ల ద్వారా భక్తులు వచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించారు.ప్రధానంగా అమెరికన్ కాన్సులేట్ జనరల్ లారా విలియమ్స్ అమ్మవారికి బోనం సమర్పించారు. గద్దర్ కూతురు వెన్నెల, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ సతీమణి అమ్మవారికి బోనం సమర్పించారు. గత రెండేళ్లతో పోలిస్తే ఈ సారి భక్తులు అధికంగా రావడంతో అమ్మవారి ఆలయం ఆర్చిగేట్ ద్వారా వీఐపీల దర్శనానికి అనుమతిచ్చారు. దేవాలయానికి వీఐపీలు వచ్చి దర్శనం చేసుకునే సమయంలో భక్తులను బోనాల క్యూలైన్‌లో అరగంట పాటు నిలిపివేయడంలో అసహనానికి గురయ్యారు.బోనాలతో వచ్చిన మరికొంతమంది భక్తులు క్యూలైన్‌లో స్పృహ తప్పి పడిపోయారు. వారికి అప్పటికప్పుడు వైద్య సిబ్బంది వైద్య సేవలు అందించారు. ప్రధానంగా ఆర్చిగేట్ నుంచి అనుమతించిన శివసత్తుల బోనాలను తీసుకొచ్చే క్రమంలో పలువురి బోనాలు సైతం కిందపడిపోయాయి. ఇది బోనాల చరిత్రలోనే మొదటి సారని భక్తులు భావిస్తున్నారు. క్యూలైన్లలో వచ్చిన భక్తులకు వివిధ సేవా సంస్థల వాలంటీర్లు మంచి నీటిని అందించి దర్శనం చేసుకునేందుకు సహకరించారు. ఉత్తర మండలం పోలీసులు డీసీపీ రక్షిణ మూర్తి నేతృత్వంలో అడిషనల్ డీసీపీ నర్సయ్య, ఏసీపీ శ్రీధర్‌ల ఆధ్వర్యంలో పోలీసులు భద్రత ఏర్పాట్లు చేపట్టారు. భారీ బందోబస్తు నడుమ జాతర ఉత్సవాలు విజయవంతమయ్యాయి.

### అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం మహంకాళి అమ్మవారిని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ దర్శించుకున్నారు. అలాగే మంత్రి సీతక్క, మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, మల్లారెడ్డి, జగదీశ్‌రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు మర్రి రాజశేఖర్‌రెడ్డి, కాలేరు వెంకటేష్, దానం నాగేందర్, శ్రీగణేష్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, మాజీ ఎంపీ హనుమంతరావు, బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయలు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే కలెక్టర్ ప్రయాంక, పలువురు జడ్జీలు, అమ్మవారిని దర్శించుకున్నారు.

### ఆకట్టుకున్న శివసత్తుల పూనకాలు

బోనాల ఉత్సవాల్లో భాగంగా భక్తులు, మహిళల బోనాలతోపాటు, శివసత్తులు సమర్పించే బోనాలు ఆకర్షణీయంగా తయారు చేశారు. వాటిని డప్పు చప్పుళ్లు, బాజాభజంత్రీలతో ఊరేగింపుగా తీసుకొచ్చి మహంకాళి అమ్మవారికి బోనాలు సమర్పించారు. బోనాలతో మహిళలు ఈ సారి రెట్టింపు సంఖ్యలో వచ్చినట్టు అధికారిక వర్గాలు తెలిపాయి. కానీ దేవాలయం వద్ద గతంతో పోలిస్తే తోపులాట కూడా అధికంగా కనిపించింది. పోలీసులు వారిని కంట్రోల్ చేసేందుకు నానా ఇబ్బందులు పడాల్సి వచ్చింది.











Publisher, Editor and Owned by Manasani Krishna Reddy, H No 4-81/1, Ramagundam, Elkalpalli, Karimnagar, Telangana - 505208.
Editor : MANASANI KRISHNA REDDY

# గోదావరి నదీమాతకు వైభవంగా హారతి

**వరదలతో ఇబ్బందులు నివారించాలని పూజలు**

**గోదావరిమాతకు పూజలు చేసిన డీఎస్పీ అరుణ్ కుమార్**

**వాస్తవం- ఖమ్మం ప్రతినిధి**

దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాచలం దివ్యక్షేత్రంలో పుణ్యగోదావరి నదీమాతకు పురోహితులు ఆదివారం వైభవంగా పూజలుచేసి హారతినిచ్చారు. శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయానికి ఎదురుగా స్నానఘట్టాల వద్ద కరకట్టపై జరిపిన అరుణ్ కుమార్ పాల్గొన్నారు. పరాభవనామ సంవత్సర దక్షిణాయనం, గ్రీష్మరుతువు, ఆషాడమాసం, బహుళ చతుర్ధిలోకి ప్రవేశించిన సందర్భంగా భక్తులకు, ప్రజలకు గోదావరి నదీమాత ఆశీస్సులుండాలని భద్రాచలం డీఎస్పీ అరుణకుమార్ ఆకాంక్షించారు. స్థానిక పురోహితుడు రామవజ్జుల రవికుమార్ ఆషాడమాసంలో, బహుళ చతుర్థి రోజు చాలా విశేషమైందని, ఈరోజు గోదావరి నదీహారతి కూడా చాలా విశిష్టమైనదని తెలిపారు. గోదావరి హారతి విశేషాలు, ఆషాడమాసం, చవితికి సంబంధించిన విశిష్టత గురించి భక్తులకు తెలియచేసిన పురోహితులు గణపతిపూజతో దీపాలు వెలిగించి, పూజాద్రవ్యాలతో గోదావరికి అష్టోత్తర శతనామార్చన చేశారు. లోక కళ్యాణార్థమై ఆదివారం నిర్వహిస్తున్న ఈ మహత్కార్యంలో స్థానికులు, భక్తులు పాల్గొని రామానుగ్రహం, గోదావరిమాత ఆశీస్సులు పొందుతున్నారన్నారు. ఈ సందర్భంగా శాంతి మంత్రపఠనం జరిపి పురోహితులసంఘం తరఫున ప్రసాదం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో సత్యప్రసాద్ శర్మ, పవన్ కుమార్ శర్మ, రామాచార్యులు, వీరభద్రశర్మ, సుబ్రహ్మణ్యంచార్యులు, తిరుపతిరావు, ఎన్.ఎస్.ఎన్.రెడ్డి, రామకృష్ణ, తేజశర్మ, అశోక్ కుమార్, శివ, తదితరులు పాల్గొన్నారు.



# కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం మానుకోవాలి

**బీఆర్ఎస్ నేతలు**

**గాయత్రి పంప్‌హౌస్‌ను సందర్శించిన జీవన్‌రెడ్డి, వినోద్‌కుమార్, గంగుల కమలాకర్ తదితరులు**

**వాస్తవం-గంగాధర**

చొప్పదండి నియోజకవర్గం రామడుగు మండలం లక్ష్మీపూర్ గ్రామంలోని గాయత్రి పంప్‌హౌస్‌ను ఆదివారం బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి జీవన్‌రెడ్డి, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎమ్మెల్సీ ఎల్. రమణ, చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్, పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తదితరులు సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పంప్ హౌస్ పనితీరు, నీటి ఎత్తిపోతల ప్రక్రియపై పరిశీలించారు.అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం, కాళేశ్వరం ప్రాజెక్టుపై చేస్తున్న విమర్శలను బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రజలను తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలు మానుకోవాలని సూచించారు.చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ మాట్లాడుతూ, గ్రావిటీ అంటే ఏమిటో కూడా తెలియకుండా కొందరు నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. పాదయాత్రలు చేస్తే పంపులు ఆన్ కావని, నీటి నిర్వహణపై కనీస అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మేడిగడ్డకు, మేడారంకు తేడా కూడా తెలియని నాయకులు కాళేశ్వరం ప్రాజెక్టుపై విమర్శలు చేయడం హాస్యాస్పదమని అన్నారు. 2014కు ముందు ఎల్లంపల్లి ద్వారా మెట్ట ప్రాంతాలకు సాగునీరు ఎందుకు అందలేదో కాంగ్రెస్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సైక్లోన్ ప్రభావంతో కురిసిన వర్షాలను తమ ఘనతగా చెప్పుకోవడం ప్రజలను మోసం చేయడమేనని ఆరోపించారు. గిరి ప్రదక్షిణలు చేయడం వల్ల కాదు, రైతులకు నీళ్లు అందించే కార్యాచరణతోనే ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో మెట్ట ప్రాంత రైతులు వలసలు, ఆత్మహత్యలతో ఇబ్బందులు పడ్డారని, బీఆర్ఎస్ హయాంలో అదే ప్రాంతాలు సస్యశ్యామలం అయ్యాయని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో ఎండిన కాలువలకు జీవం పోసి తెలంగాణ వ్యవసాయ రంగానికి కొత్త దిశను కేసీఆర్ ప్రభుత్వం చూపిందని అన్నారు. తెలంగాణను దేశానికి అన్నం పెట్టే స్థాయికి తీసుకెళ్లిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వానిదేనని పేర్కొన్నారు.మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ, అన్నారం--సుందిళ్ల బ్యారేజీలే ఎల్లంపల్లి ప్రాజెక్టుకు ప్రధాన నీటి ఆధారమని వివరించారు. మేడిగడ్డ వద్ద సముద్రంలో వృథాగా కలిసిపోయే వరద జలాలను కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా వినియోగిస్తున్నామని చెప్పారు. ఎల్లంపల్లి జలాలు హైదరాబాద్ తాగునీటి అవసరాలకు అత్యంత కీలకమని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు ఆందోళనకర స్థాయిలో ఉన్నాయని హెచ్చరించారు. రాజకీయ విమర్శల కంటే తెలంగాణ నీటి ప్రయోజనాలే ముఖ్యమని స్పష్టం చేస్తూ, అన్నారం--సుందిళ్లపై నిరాధార ఆరోపణలు మానుకుని ప్రజలకు వాస్తవాలు చెప్పాలని కాంగ్రెస్ నేతలను కోరారు.కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ, గ్రావిటీతోనే నీళ్లు వస్తే కాళేశ్వరంలో బాహుబలి మోటార్లు ఎందుకు ఏర్పాటు చేశారని ప్రశ్నించారు. మేడిగడ్డ నుంచి గాయత్రి పంప్‌హౌస్ వరకు ఒక్క చుక్క నీరు కూడా గ్రావిటీ ద్వారా రాదని స్పష్టం చేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల సాగునీటి పథకంగా కాళేశ్వరాన్ని నిర్మించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని అన్నారు. వందల మీటర్ల ఎత్తుకు నీటిని ఎత్తిపోసే ఇంజినీరింగ్ అద్భుతమే కాళేశ్వరం ప్రాజెక్టు అని కొనియాడారు. ప్రాజెక్టుపై పూర్తి అవగాహన లేకుండానే కొందరు మంత్రులు ప్రజలను తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. కాళేశ్వరం విజయానికి బాహుబలి మోటార్లు, పంప్‌హౌస్‌లే ప్రాణమని, తెలంగాణ రైతాంగానికి సాగునీరు అందించిన ఘనత పూర్తిగా బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే చెందుతుందని కమలాకర్ పేర్కొన్నారు.





# స్నేహం గొప్ప వరం

## బాల్య మిత్రులతో స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్న 'అల్ఫోర్స్' నరేందర్ రెడ్డి



**వాస్తవం : స్టేట్ కల్చరల్ బ్యూరో**

స్నేహం అనేది గొప్ప వరమని మరియు మనం అభివృద్ధి చెందగలమని తద్వారా సమాజంలో అత్యుత్తమ గుర్తింపుతో ఉండవచ్చని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, వీఎన్ఆర్ ఫౌండేషన్ స్థాపకులు , ఆల్ఫోన్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి జాతీయ స్నేహితుల దినోత్సవం జరుపుకున్న సందర్భంగా అన్నారు. 1984 బ్యాచ్ 10వ తరగతి మిత్రులైనవారితో ప్రత్యేక వేడుకలలో పాల్గొని ఉత్సవాల వైభ వా న్ని రెట్టింపు చేశారు.ఈ కార్యక్రమంలో వారి మిత్రులు రఘునందన్ రావు , జిల్లా సైన్స్ అధికారి – పెద్దపల్లి, జి భూమేశ్వర్ , సిహెచ్ వెంకటలక్ష్మి, గంగాచారి, ఏ జనా ర్ధన్ , గుర్రం నర్సయ్య, ఉపసర్పంచ్ కొడిమ్యాల, ఫసియోద్దీన్,ఏఎస్ఐ, చొప్పదండి, సాగి సతీష్‌రావు ,ఎంపీడీవో,మానకొండూర్ తదితరులు పాల్గొన్నారు. వేడుకల సందర్భంగా తోటి స్నేహితులతో ఆటపాటల్లో పాల్గొని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

# కాంగ్రెస్ మహిళా కమిటీ ఏర్పాటు

**-ఎస్సార్ నగర్ అధ్యక్షురాలిగా ఎం.డి. గౌసియా ఏకగ్రీవ ఎన్నిక**




**వాస్తవం : వరంగల్ ప్రతినిధి: ఆగస్టు 02**

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు ఆదేశాల మేరకు, ఆదివారం 14వ డివిజన్ అధ్యక్షులు సయ్యద్ ఇంతియాజ్ మరియు ఎస్ఆర్ నగర్ గ్రామ అధ్యక్షుల ఆధ్వర్యంలో నూతన కాంగ్రెస్ మహిళా కమిటీ ఏర్పాటు కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా ఎస్సార్ నగర్ మహిళలు ఏకగ్రీవంగా ఎం.డి. గౌసియా ను ఎస్సార్ నగర్ కాంగ్రెస్ మహిళా కమిటీ అధ్యక్షురాలిగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమం లో ముఖ్యఅతిథిగా హాజరైన కాంగ్రెస్ 14వ డివిజన్ అధ్యక్షులు సయ్యద్ ఇంతియాజ్ ను మహిళలు ఘనంగా సన్మానించారు. అనంతరం సయ్యద్ ఇంతియాజ్ మాట్లాడుతూ.. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎం.డి. గౌసియా కు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియ జేశారు. వారి నాయకత్వంలో మహిళా కమిటీ మరింత బలోపేతమై, మహిళల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ.. పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేయాలని సూచించారు.

# బోనాల ఉత్సవాలు తెలంగాణ సంస్కృతికి చిహ్నం

**నీలం మధు ముదిరాజ్**

**మహేశ్వరంలో ఘనంగా బోనాల పండుగ .. పాల్గొన్న నీలం**



**వాస్తవం : పటాన్చెరు : ఆగస్ట్ 02**

తెలంగాణ సంస్కృతిలో బోనాల పండుగకు ప్రత్యేక స్థానం ఉంది అని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్ అన్నారు.ఆదివారం ఆషాడ మాస బోనాల పండుగ సందర్భంగా ఆయన రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరంలోని శ్రీశ్రీశ్రీ మహంకాళి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారిని దర్శించుకున్నారు, ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనకు ఘనస్వాగతం పలికి సత్కరించారు, ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని వర్షాలు సమృద్ధిగా కురవాలని ఆ అమ్మవారిని కోరుకున్నట్టు తెలిపారు, ఈ కార్యక్రమంలో స్థానికులు మహేందర్, ఈశ్వర్ , మల్లేష్,హరికృష్ణ,ఎట్టయ్యా,జంగయ్య,యాదయ్య,కుమార్,పరమేశ్,నరేష్,శ్రీను, కావలి జంగయ్య, మహేష్, శివరామకృష్ణ, జాతర నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులు ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలి

**అమ్మను వేడుకున్న వైస్ చైర్మన్ చిట్టిబాబు**



**వాస్తవం : అందోల్**

పట్టణంలోని రైతులు ప్రజలు నా వాడు ప్రజల సుఖసంతోషాలతో ఉండాలని అందోల్ జోగిపేట మున్సిపల్ వైస్ చైర్మన్ 15వ వార్డు సభ్యులు ఆకుల చిట్టిబాబు అన్నారు.ఆషాడ మాసం సందర్బంగా అందోల్ జోగిపేట మున్సిపల్ పరిధిలో ఆదివారం 15వ వార్డులో రజకసంగము ఆధ్వర్యంలో అమ్మవారికి బోనాలు తీయడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు బాగా పడాలే పాడిపంటలు బాగా పండాలె రైతులు ప్రతి ఒక్కరి ఇండ్లల్లో ఆనందం వెల్లివిరియ లని అందోల్ జోగిపేట మున్సిపల్ పరిధిలో ఉన్న ప్రతి ఒక్కరికి అమ్మవారి ఆశీస్సులతో ఆయురారోగ్యాలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని అమ్మవారిని వేడుకోవడం జరిగింది అనంతరం కాలనీ ప్రజలు భక్తిశ్రద్ధలతో బోనాలు తీశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ (చిట్టిబాబు )ఆత్మ కమిటి డైరెక్టర్ ఖాలేదు, కాంగ్రెస్ లీడర్ సోహెయిల్, చోటు, రమేష్, చెన్నయ్య, గంగని రమేష్, మురళి, రవి, సుబ్బు,చంటి, భరత్, రాజు, రమేష్, శ్రీనివాస్, జోగయ్య, అలాగే రజక సంఘం ఆడపడుచులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో యువకునికి తీవ్ర గాయాలు



**వాస్తవం: చందుర్తి**

చందుర్తి మండలం బండపల్లి–ఎన్గల్ గ్రామాల మధ్య ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది.ఎన్గల్ గ్రామానికి చెందిన పులి ప్రణయ్ ద్విచక్ర వాహనంపై వెళుతుండగా అదుపుతప్పి కింద పడడంతో తలకు తీవ్రంగా గాయాలయ్యాయి.అటుగా వెళుతున్న ప్రయాణికులు, స్థానికులు వెంటనే అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో ఈఎంటి ప్రశాంత్, పైలెట్ తోట నరేందర్ చేరుకొని ప్రథమ చికిత్స చేసి అనంతరం వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

# వైభవంగా బోనాల ఉత్సవాలు



**వాస్తవం : రాజేంద్రనగర్**

రాజేంద్రనగర్ నియోజకవర్గం మైలార్దేవ్ పల్లి డివిజన్ బాబుల్ రెడ్డి నగర్, పల్లె చెరువు, లక్ష్మీగూడా, శాంతినగర్ లోని అమ్మవారి దేవాలయాలలో అత్యంత వైభవంగా బోనాల ఉత్సవాలు జరిగాయి. ఆదివారం బాబుల్ రెడ్డి నగర్ లోని శ్రీ పోచమ్మ దేవాలయంలో జరిగిన బోనాల ఉత్సవాలలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలిగి వారి జీవితాలలో సమృద్ధి నింపాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ ఉత్సవాలలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి బోనాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు అడికె జనార్దన్, రమేష్ రెడ్డి, మన్మోహన్ రెడ్డి, మధుసూదన్, రావుల భాస్కర్, శ్రీనివాస్, శ్రీకాంత్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# స్నేహబంధాలే సమాజానికి అసలైన బలం

**నర్సంపేట వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో**

**ఘనంగా అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవ వేడుకలు**

**ముఖ్య అతిథిగా డాక్టర్ పుల్లూరి శ్రీనివాస్ గౌడ్**

**నర్సంపేట, ఆగస్టు 2 : వాస్తవం**



ఆరోగ్యవంతమైన జీవనానికి నిత్య వ్యాయామంతో పాటు ఆత్మీయ స్నేహబంధాలు కూడా అంతే అవసరమని వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్, ఎస్సార్ యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్, వరంగల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ పుల్లూరి శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. స్థానిక మినీ స్టేడియంలో నర్సంపేట వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. స్నేహం మనిషి జీవితాన్ని సార్థకం చేసే అమూల్యమైన బంధమని, ప్రతిరోజూ వాకింగ్ చేయడం ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు పరస్పర విశ్వాసం, ఆత్మీయత, సామాజిక ఐక్యత మరింత బలోపేతమవుతాయని అన్నారు. వాకర్స్ అసోసియేషన్ నిర్వహిస్తున్న కార్యక్రమాలు ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు సమాజంలో స్నేహభావాన్ని మరింత విస్తరింపజేస్తున్నాయని కొనియాడారు. ఈ సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, మహిళా వాకర్స్ పరస్పరం స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకుని ఆత్మీయ వాతావరణంలో వేడుకలను నిర్వహించారు. ఆరోగ్యం, స్నేహం, ఐక్యతకు ప్రతీకగా నిర్వహించిన ఈ కార్యక్రమం మినీ స్టేడియంలో సందడి వాతావరణాన్ని సృష్టించింది. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆడపు సదానందం, కోశాధికారి సంకినేని కృష్ణ, స్టేడియం ఇన్‌చార్జి, కబడ్డీ కోచ్ యాట రవికుమార్ ముదిరాజ్, ఉపాధ్యక్షులు అమ్మద్ పాషా, సంగేపు శ్రీనివాస్, మనోహర్ గౌడ్, సహాయ కార్యదర్శులు గందు రవి గౌడ్, వెంగల బిక్షపతి, మాజీ ప్రధాన కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ గుప్తా, సభ్యులు కేశపాక అశోక్, రామ్మూర్తి, సాన్యో శ్రీనివాస్, దొడ్డ రమేష్ గుప్త, లక్షపతి, క్రాంతి, సురేందర్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు. స్నేహబంధాల విలువను చాటిచెబుతూ, ఆరోగ్యకర జీవనశైలిపై అవగాహన పెంపొందించిన ఈ వేడుకలు నర్సంపేటలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

# ప్రజల ప్రయాణానికి భరోసా కల్పించండి

**సదర్శాపురం రహదారిని వెంటనే బాగు చేయండి**



**వాస్తవం : మోత్కూర్**

బీజేపీ మోత్కూర్ మండల పార్టీ ఆధ్వర్యంలో ఎన్‌హెచ్-930పీ నుండి సదర్శాపురం గ్రామానికి వెళ్లే రహదారిని మండల నాయకులు పరిశీలించారు. ప్రజల ప్రాణాలకు ప్రమాదకరంగా మారిన ఈ రహదారిని వెంటనే మరమ్మతు చేసి, శాశ్వత పరిష్కారంగా నాణ్యమైన బీటీ రోడ్డు నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మోత్కూర్ మండల పార్టీ అధ్యక్షులు గుదే. మధుసూదన్ యాదవ్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఏనుగు. జితేందర్ రెడ్డి, మండల కిసాన్ మోర్చా అధ్యక్షులు భీముడి. తిరుమలరెడ్డి, మండల ఉపాధ్యక్షులు గుంటి. సతీష్, బూత్ అధ్యక్షులు చిలుకా. నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# అమ్మవారికి బోనం సమర్పించిన మనాలి ఠాకూర్

**రామగుండం ప్రజల సంక్షేమం కోసం ప్రత్యేక పూజలు**

**రామగుండం ప్రజల సంక్షేమం కోసం అమ్మవారిని వేడుకున్న మనాలి ఠాకూర్**

**వాస్తవం : గోదావరిఖని, ఆగస్టు, 2**



రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు, ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు, వారి సతీమణి శ్రీమతి మనాలి ఠాకూర్ ఈరోజు గోదావరిఖని పవర్ హౌస్ కాలనీలోని శ్రీ పెద్దమ్మ తల్లి నాగదేవతా దేవాలయంలో నిర్వహించిన ఆషాడమాస బోనాల మహోత్సవాల్లో భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి సంప్రదాయబద్ధంగా బోనం సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రామగుండం నియోజకవర్గ ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రాంతం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని అమ్మవారిని ప్రార్థించారు. బోనాల వేడుకల్లో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు సంఖ్యలో పాల్గొన్నారు.

# బోనమెత్తిన జోగిపేట ప్రజలు

**పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే శ్రీ క్రాంతి కిరణ్**



**వాస్తవం : ఆందోల్**

ఆషాడ మాసం పర్వదినాలను పురస్కరించుకొని జోగిపేట పట్టణంలోని ప్రజలు బోనాల పండుగను ఘనంగా జరుపు కొన్నారు. జోగిపేట పట్టణంలోని 9 వ వార్డు హౌజింగ్ బోర్డు కాలనీ లో వెలిసిన శ్రీ మహంకాళి అమ్మవారికి కౌన్సిలర్ శ్రీమతి శోబా నారాయణ గౌడ్ అధ్వర్యంలో శ్రీ గంగమ్మ తల్లికి , 13 వ వార్డులో వెలసిన శ్రీ గడి మైసమ్మ తల్లి కి అవార్డు కౌన్సిలర్ పట్లూరీ శివ శేఖర్ అధ్వర్యంలో జోగిపేట పట్టణంను కాపాడుతున్న శ్రీ పోచమ్మ తల్లికీ ఘనంగా భక్తులు భారీ ఎత్తున బోనాలు సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ పండుగ లో అందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, మాజీ ట్రేడ్ కార్పో రేషన్ చైర్మన్ బిక్షపతి, మాజీ ఏఎంసీ చైర్మన్లు పి నారాయణ ముదిరాజ్ డి బి నాగభూషణం, మల్లికార్జున గుప్తా, మాజీ ఎంపిపి రామ గౌడ్ మున్సిపల్ ఛైర్మెన్ కృష్ణారెడ్డి టిఆర్ఎస్ నాయకులు లింగా గౌడ్, చాపల వెంకటేశం, బిర్ల శంకర్, వుసా నాగరాజు, ఆకుల శంకర్, డాకురీ అశోక్ మీడియా ప్రతినిధులు రాజశేఖర్ కులకర్ణి,ప్రదీప్ గౌడ్ గాజుల అనీల్ కుమార్, అయ్యప్ప నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

# ముత్తరావ్ పల్లి గ్రామంలో విషాదం

**వాస్తవం : చెన్నూరు ఆర్సీ: ఆగస్టు 02**



చెన్నూరు మండలం ముత్తరావుపల్లి గ్రామంలో ఇటీవలే జాడి ప్రవీణ్ అనే గ్రామ పంచాయతీ మల్టీ పర్పస్ వర్కర్ తో పంచాయతీ కార్యదర్శి, గ్రామ సర్పంచ్ నిషేధిత గడ్డి మందును గ్రామంలో పిచికారి రెండు మూడు రోజులు చేయించినట్లుగా ఆరోపిస్తున్న కుటుంబ సభ్యులు.. మంచిర్యాల లోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో వైద్యం చేయిస్తుండగా గడ్డిమందు పిచికారి చేసిన కారణంగానే మృతుడి ఊపిరితిత్తులు, కిడ్నీలు పాడైనట్లు వైద్యులు ధ్రువీకరించినట్లు తెలిపిన కుటుంబ సభ్యులు..పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి..పోస్టుమార్టం నిమిత్తం ప్రవీణ్ మృతదేహన్ని చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు.శవ పరిక్షలు చేసినపుడు జాడి ప్రవీణ్ భార్య, ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. నా పిల్లలకు ఆధారం చూపెట్టండి నాకు న్యాయం చేయండి అని అడగగా ముత్తరావుపల్లి.సర్పంచ్ ఉప సర్పంచ్. సెక్రటిరీ వీళ్లంతా కలిసి ఆమెకు న్యాయం చేస్తాము ఆమె భర్త ఏ పని చేశారో అందులోనే ఈమెకు పనివచ్చే విధంగా మేము చూస్తాము అదేవిధంగా 11 రోజుల వరకు అయ్యే ఖర్చునుమేం భరించుకుంటామని తెలియజేశారు.అని. చెన్నూరు ఎస్ఐ శ్యామ్ పటేల్, ఐ ఎఫ్ టి యు నాయకులు మాసాని రమేష్, కావేరి సంతోష్, కావేరి రవి, వాళ్ల పెద్ద మనుషల ముంగట చెప్పినారు చెప్పిన. జాడి ప్రవీణ్ భార్య, నాకు న్యాయం జరగక పోతే నేను మళ్లీ కేసు పెడతాను అని అన్నారు. అనంతరం చెన్నూర్ గవర్నమెంట్ హాస్పటల్ నుంచి డెడ్ బాడీ తీసుకొని ముత్తరావుపల్లిలో అంతక్రియలు జరిపించారు.

**ఫీజు రీయంబర్స్మెంట్ కోసం**

# పాలి టెక్నిక్ విద్యార్థుల ధర్నా వస్తారోకో



**వాస్తవం : అందోల్**

ఫీజురియంబర్స్మెంట్ బకాయిలు చెల్లించాలంటూ పాలిటెక్నిక్ విద్యార్థులు ధర్నా రాస్తారోకో చేశారు. చౌటుకురు మండలం శివంపేట క్రాసింగ్ వద్ద పాలిటెక్నిక్ విద్యార్థులు రోడ్డెక్కి ధర్నా రాస్తారోకో చేశారు. వీరికి స్థానిక బిజెపి నాయకులు మద్దతు పలికి ధర్నాలో పాల్గొన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రియంబర్స్మెంట్ వల్ల ఎంతో మంది విద్యార్థుల జీవితాలు నాశనం అవుతున్నాయని చదువు పూర్తి అయిన కొన్ని కళాశాలలోసర్టిఫికెట్లు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ఎలాగైనా రియంబర్స్మెంట్ విడుదల చేయాలని ధర్నా చేశారు. దీంతో ట్రాఫిక్ ఇబ్బందిగా మారింది దీనికి సంగారెడ్డి డిఎస్పి సత్తయ్య గౌడ్ విద్యార్థులకు నచ్చ చెప్పి బిజెపి నాయకులను విద్యార్థులు శాంతింప చేశారు.

# ప్రపంచ ఆదివాసి దినోత్సవ వారోత్సవాలను జయప్రదం చేద్దాం

**ఎర్మ పున్నం జిల్లా కార్యదర్శి**

**తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం టి ఏ జి పిలుపు**

**వాస్తవం : ఆర్సి చెన్నూరు ఆగస్టు 02**



తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆగస్టు 9 ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుంది ఈ సందర్భంగా వేమనపల్లి మండల కేంద్రంలో సన్నాహక సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఎర్మ పున్నం మాట్లాడుతూ అనేక సంవత్సరాల కాలంగా ఈ ప్రాంతంలో ఆదివాసిలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై నిరంతరం పోరాటాలు చేసాము ఆదివాసి రైతులపై అటవీశాఖ అధికారుల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేసి హక్కు పత్రాలు ఇప్పించడం జరిగింది. ఆదివాసీలు వేసుకున్న పంటలను ధ్వంసం చేసిన అటవీ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆదివాసులకు అండగా ఉంటూ పోరాటాలు చేయడం మూలంగా అటవీ అధికారులను తిప్పి కొట్టగలిగాము. మరియు ఈ ప్రాంతంలో ఆదివాసీల పైన పెత్తందారుల దౌర్జన్యాలు అడ్డు అదుపు లేకుండా ఉన్నాయి వారి దౌర్జన్యాల మూలంగా నిరుపేద ఆదివాసి చనిపోవడం జరిగింది ఆ కుటుంబానికి అండగా అనేక కార్యక్రమాలు నిర్వహించి ఆ యొక్క కుటుంబానికి తగిన న్యాయం జరిగే వరకు పోరాటాలు చేయడం జరిగింది. భవిష్యత్తులో ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని పురస్కరించుకొని మన హక్కులను కాపాడుకోవడం కోసం ఇలాంటి దౌర్జన్యాలపై మరెన్నో పోరాటాలు చేయడానికి కార్యచరణ రూపొందించుకోవడం జరుగుతుంది. కావున వేమనపల్లి మండల కేంద్రంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవ వారోత్సవాల సందర్భంగా ఆగస్టు 6వ తేదీన ఘనంగా మండల కేంద్రంలో నిర్వహించడం జరుగుతుంది. ఈ యొక్క సభకి అన్ని ఆదివాసి గ్రామాల నుండి ఆదివాసీలు, రైతులు, మేధావులు, విద్యార్థులు, యువకులు ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని మరియు ప్రపంచ ఆదివాసి దినోత్సవ స్ఫూర్తిని చాటేందుకు అన్ని గ్రామాలలో జెండా ఆవిష్కరణలు సభలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు బాల రాజన్న, జిల్లా నాయకురాలు మర్మల మల్లేశ్వరి, మండల నాయకులు కొండపల్లి వెంకన్న, మర్మల శంకర్, లగ్గామ గట్టయ్య, కొడితే లక్ష్మణ్, ఓల తిరుపతి, నాయిని పోషం, తలండి స్వరూప తదితరులు పాల్గొన్నారు

**చేర్యాల ఆకునూరు**

# ఆర్అండ్‌బీ రోడ్డు అభివృద్ధికి ఎంపీకి వినతి



**వాస్తవం : మద్దూరు**

చేర్యాల అంగడి బజార్ నుండి ఆకునూరు వరకు ఉన్న ఆర్అండ్‌బీ రహదారి అధ్వాన్న పరిస్థితిపై తక్షణ చర్యలు తీసుకోవాలని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డిను చేర్యాల మాజీ జెడ్పీటీసీ కొమ్ము నర్సింగరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ కౌన్సిలర్లు కొమ్ము రాజేశ్వరి, మహమ్మద్ షరీఫా బేగం కలిసి కోరారు. ఈ సందర్భంగా రహదారి దుస్థితిని వివరిస్తూ పత్రికల్లో ప్రచురితమైన వార్తల కటింగ్‌లతో పాటు, చేర్యాల మున్సిపల్ పాలకవర్గం ఆమోదించిన ఏకగ్రీవ తీర్మానం ప్రతిని ఎంపీకి సమర్పించారు. ఈ సమస్యను రాష్ట్ర రోడ్లు--భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి రహదారి అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. వినతిపై సానుకూలంగా స్పందించిన ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డితో ఈ విషయమై మాట్లాడినట్లు తెలిపారు. ఇటీవల చేర్యాలలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల సందర్భంగా ఎంపీ స్వయంగా రహదారిని పరిశీలించగా, దాని అధ్వాన్న స్థితిని కొమ్ము నర్సింగరావు చూపించి వివరించినట్లు తెలిపారు. అదేవిధంగా, జిల్లాలో చిన్న మండలమైన జగదేవపూర్ లోనే ఆర్అండ్‌బీ డివిజన్ కార్యాలయం ఉండగా, ఉమ్మడి వరంగల్ జిల్లాలో పాత తాలూకా కేంద్రం, నియోజకవర్గ కేంద్రం అయిన చేర్యాలలో కూడా ఆర్అండ్‌బీ డివిజన్ కార్యాలయం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ అంశాన్ని కూడా మంత్రి దృష్టికి తీసుకెళ్తానని ఎంపీ హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చేర్యాల మండల మాజీ కో-ఆప్షన్ సభ్యుడు ఎం.డి. ఖాజా, శనిగారి బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్స్ సంక్షేమ సంఘం
Red 914/2015
జర్నలిస్ట్స్ సంక్షేమమే పరమావధిగా
జర్నలిస్ట్స్ హక్కుల కోసం....
వాళ్ల ప్రగతి కోసం... పత్రికా స్వేచ్ఛ కోసం...
సభ్యత్వ నమోదు కోసం సంప్రదించండి సెల్ నెం॥ 9618616110

సీనియర్ జర్నలిస్ట్
మానసాని కృష్ణా రెడ్డి
సంపాదకత్వం,సారథ్యంలో
నీతిని వీడకుండా
నిజాన్ని కప్పిపుచ్చకుండా
ఉన్నది ఉన్నట్లుగా
5యేండ్లుగా
నిరాటకంగా వెలువడుతూ
రెండు తెలుగు రాష్ట్రాల్లో
అశేష పాఠాకాదరణ పొందిన
నిఖార్సయిన
తెలుగు డిజిటల్ దినపత్రిక
వాస్తవం మీడియాకు
ఖాళీల మేర విలేకర్లు కావలెను

విలేకర్లు కావలెను




వివరాలకు..
9618616110
8074124190

వాస్తవం డెయిలీ.ఇన్
డిజిటల్ పత్రిక
ఉన్నది ఉన్నట్లుగా


## మూడు రోజులుగా తాగునీటికి కటకట



**పాలకవీడు : వాస్తవం**

బెట్టే తండ గ్రామపంచాయతీ ఆర్ పాడియా తండా గ్రామంలో యల్టీ లైన్ మీదకి యాప చెట్టు కొమలు అల్లుకోవడం వలన లైన్ జంపర్ కొట్టేస్తుంది. లైన్ క్లియర్‌చైయడంలేదు. తండలో మూడు రోజుల నుంచి మంచినీళ్లు లేక అల్లాడుతుడగా పాలకవీడు లైన్మేన్ వెంకటేశ్వర్లు గారికి తెలియజేసిన పట్టించుకోవడం లేదు. తండలో ట్రాన్స్ఫారాని కి హెవీ స్విచ్ కూడా లేకపోవడం వలన తండా మోటారు కాలిపోవడం జరిగింది దయచేసి ఈ పరిష్కారం చేయగలరు.

### గగన్ పహాడ్ బస్తీలో
## కనుల పండువగా బోనాలు



**వాస్తవం : రాజేంద్రనగర్**

రాజేంద్రనగర్ నియోజకవర్గం గగన్ పహాడ్ బస్తీలో ఆదివారం పోచమ్మతల్లి, మైసమ్మ తల్లి ఆలయాలలో బోనాల వేడుకలు అత్యంత వైభవంగా, కన్నుల పండువగా ఘనంగా నిర్వహించారు. స్థానిక బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు శీలం తిరుపతిరెడ్డి ఈ ఉత్సవాలలో పాల్గొన్నారు.పోతురాజుల విన్యాసాలు,శివసత్తుల పూనకాల మధ్య మహిళలు ఊరేగింపుగా వెళ్లి అమ్మవార్లకు బోనాలు, నైవేద్యాలు సమర్పించారు. పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, గ్రామస్తులు ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని కోరుకుంటూ ప్రతి ఏడాది బోనాల పండుగ ఘనంగా నిర్వహిస్తామని తిరుపతిరెడ్డి తెలిపారు.

### వాస్తవం కథనానికి
## స్పందించిన అధికారులు


వాస్తవం
2026-06-19
https://www.vasthavam.com/
చుక్క నీటి కోసం రాత్రంతా జాగారం

**వాస్తవం : జూబ్లీహిల్స్**

చుక్క నీటి కోసం రాత్రంతా జాగారం అనే కదనంతో రాసిన వార్తకు సంబంధిత అధికారులు స్పందించి సరి చేసి నిర్ణీత సమయాలలో వాటర్ ను వదిలారు అని సమస్యను పరిష్కరించాలని వాస్తవంలో వార్త గురించిన సమస్యను వివరించిన న్యాయవాది, బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు నవీన్ కుమార్ పోగుల వెల్లడించారు ఏది ఏమైనా ప్రజా సమస్యలపై నిత్యం పోరాడుతూ, నిత్యం ప్రజలతో ఉంటున్న నవీన్ పటేల్ కృషిని యూసఫ్ గూడా ప్రజలు ప్రజలు అభినందిస్తున్నారు.


జర్నలిస్ట్స్ సంక్షేమ సంఘం
Red 914/2015
జర్నలిస్ట్ల సంక్షేమమే పరమావధిగా
జర్నలిస్ట్ల హక్కుల కోసం....
వాళ్ల ప్రగతి కోసం... పత్రికా స్వేచ్ఛ కోసం...
సభ్యత్వ నమోదు కోసం సంప్రదించండి సెల్ నెం॥ 9618616110